
కథ

న్యూయార్క్ నుండి భారతదేశానికి వెళ్ళేందుకుగాను, జె.ఎఫ్.కె అంతర్జాతీయ విమానాశ్రయానికి ఇంటి నుండి మూడు గంటల ముందుగా బయల్దేరాను కారులో. పక్కన రాణి కూర్చున్నది. వెనుక మా పదేళ్ళ అబ్బాయి, ఆరేళ్ళ అమ్మాయి కూర్చున్నారు. నేను క్యాబ్‌లో వెళతానన్నాను. కాదు తనే డ్రాప్ చేస్తానంది రాణి. రాణి ఎయిర్‌పోర్ట్‌దాకా ఎందుకు వచ్చేది నాకు తెలుసు. ఈ గంట ప్రయాణంలో తీరిగ్గా నాకు క్లాసు తీసుకోవచ్చన్నది తన ఆలోచన. నేను ఇండియాలో ఏం చేయాలో, ఏం చేయకూడదో, ఎవరితో ఎలా మాట్లాడాలో విపులంగా చెబుతుందన్నమాట!

# ముందు చూపు

పి.ఎస్. నారాయణ



రాత్రి గుంటూరు నుంచి ఫోను వచ్చింది. నాన్న పోయారట!

మధ్యాహ్నం ఫ్లయిట్‌కు గాని టిక్కెట్టు దొరకలేదు.

అందుకే ఫోను చేసిన బాబాయికి చెప్పాను: నేను వచ్చిందాకా శవాన్ని ఉంచటం ఇబ్బందవుతుంది, ఆ కార్యక్రమం పూర్తి చేసేయమన్నాను. కానీ, డబ్బు యావతో విదేశాలకు వచ్చింతరువాత ఇలాంటివి దిగమింగి ఊరుకోక తప్పదు!

బాబాయి అడగనే అడిగాడు: ''అయితే నీ భార్య రావటం లేదా?''

నాకు అబద్ధమాడక తప్పలేదు. ''పిల్లలకు పరీక్షలు... వాళ్ళ కోసం తను ఉండాలి ఇక్కడ!''

అసలు రాణికి నేను వెళ్ళటమే ఇష్టం లేదు!

''శవాన్నయినా చూడలేనప్పుడు మీరు అక్కడకు వెళ్ళి చేసేదేమున్నది... మీ సవితి తల్లిని ఓదార్చటానికా?... ఆమె వైపు కావాల్సినంత గుంపున్నది ఆ గుంటూరులోనూ, చుట్టుపక్కల ఊళ్ళలోనూ... మీరిప్పుడు వెళ్ళాలనుకోవటంలో డబ్బు వృధా తప్ప ఒరిగేదేమీ లేదు!''

కానీ దానికేం తెలుసు, నేనామెను ఎప్పుడూ సవితి తల్లిగా చూడనేలేదని... స్వంత తల్లయితే ఎలా పెంచేదో గాని, ఆమె నాకు స్వంత తల్లి కూడా గుర్తుకు రానంతగా పెంచింది.... నా నాలుగో ఏట, నా తల్లిపోయిన రెండు సంవత్సరాలకు మా ఇంట కాలు పెట్టినప్పటినుండి....

ఆమె అభిమానంగా చూడకపోతే, నన్ను అంతగా ప్రేమించకపోతే నేను ఈనాడు ఇంత వాడిని అయ్యేవాడినేనా?

కాని దానికి రాణి భాష్యం వేరు. ''ఆమెకు పిల్లలు లేరు కాబట్టి మిమ్మల్ని పట్టుకు వేలాడుతోంది- రేపు ఎటుబోయి ఎటు వస్తుందోనని! అంతేకాని, మీమీద ప్రేమతో కాదు!''

ఆమె నాకు స్వంత తల్లి కాదు అనే విషయం ఎవరో కొద్దిమంది వయస్సు మళ్ళిన వాళ్ళకు తెలుసేమో- అంతే!

''డాడీ! మా ఫ్రెండింట్లో చూశాను... కొండపల్లి బొమ్మలట... ఎంత బాగున్నయ్యో తెలుసా... నువ్వు కొనుక్కు రావాలి నాకు ఓ పదన్నా... ఈ సారి బొమ్మల్లో పెడదాం!'' అన్నది జిక్కి- బామ్మ పేరు!

''నాకు నాన్నా!'' మా అబ్బాయి జగన్ అడిగాడు.

''చెప్పు ఏం కావాలో... చెల్లెలికి బొమ్మలు, అమ్మకు చీరలు... నీదే సెటిల్ అవ్వాలి!''

''బామ్మను తీసుకురా!''

ఒక్కసారి రాణి విసురుగా కొడుకు వంక చూసింది. ''నోర్మూసుకు కూర్చో!'' అంటూ ఒక్క కసురు కసిరింది.

నేను చూపు మరల్చకుండా రోడ్డు వంకే చూస్తూ డ్రైవ్ చేస్తున్నాను.

''మీరు ఎప్పుడు బయల్దేరుతున్నారు, అక్కడ?''

''చెప్పావు కదా... పదమూడో రోజే బయల్దేరి హైదరాబాద్ వచ్చేయమని...''


''గుంటూరులో పనులయింతరువాత ఒక్క క్షణం వుండవద్దు... ఆమె అన్నలు, తమ్ముళ్ళు మీ మీద చాలా ఒత్తిడి తీసుకు వస్తారు ఆస్తి విషయంలో, ఇక్కడేదో మీరు లక్షలు లక్షలు సంపాదిస్తున్నారనే ఉద్దేశ్యంతో... మన ఖర్చుల సంగతి ఎవరికి తెలుస్తుంది... ఇప్పటికి ఇప్పుడు మీ ఫోనూ రానూ ఛార్జీలకే లక్ష దాటుతుంది... వాళ్ళడిగిందే చాలుగా ప్రతిదానికీ గుమ్మటంలా తల ఊపవద్దు... మీ నాన్న సంపాదించిన పొలాలు, ఇల్లు ఉన్నాయి... సగమే ఆమెకివ్వండి... మిగతా సగం మీ బాబాయి ద్వారా అమ్మించి డబ్బు పంపే ఏర్పాటు చేసిరండి... వినబడిందా?''

''చిత్తం!''

''ఎగతాళి కాదు... ఆమె మీ స్వంత అమ్మయితే, ఇక్కడకు తీసుకురాక తప్పేది కాదు!''

''ఆమె నన్ను కన్నతల్లికంటే ఎక్కువగా పెంచింది!''

''ఆ బోడి సెంటిమెంట్లే పెట్టుకోవద్దన్నది... రేపు జగన్‌ను ఇంజనీరుగాను, జిక్కీని డాక్టరుగాను చేయాలంటే మనకెన్ని లక్షలు కావాలో ఆలోచించండి... తనకు మాలిన ధర్మాన్ని



నెత్తిన రుద్దుకుంటే మనమనుకున్నవేవీ జరక్క పోగా... అయ్యా, అప్పా అంటూ అప్పులు చేయాలి!'' కంఠాన్ని కరుకుగా మార్చి అన్నది.

నేను నిట్టూర్పు విడవటం తప్పా చేయ గలిగిందేమున్నది... ఇది అమ్మ నిర్వాకమే... బాగా డబ్బున్న వాళ్ళు, పిల్ల బాగుంటుంది... ఆ అమ్మాయి మన ఇంట కాలు పెడితే లక్ష్మీ దేవి తాండ విస్తుంది- అంటూ నా చేత మూడు ముళ్ళూ వేయించింది.

కాని, రాణితో పెళ్ళయిం తరువాత, ఆవిడ ప్రోద్బలంతో నా వాళ్ళకు దూరమయ్యాను... ఇక అమ్మ ఎంత ప్రేమగా పెంచినా, సవితి తల్లి అంటూ ముద్ర వేయించుకున్న ఆమె ఒక లెక్కా?

ఈ పది హేనేళ్ళలో అయిదారు సార్లు ఇండియాకు వెళ్ళి వుండవచ్చు- అక్కడ వున్నన్ని రోజుల్లో ఎక్కువగా గడిపింది రాణి పుట్టింట్లోనే.

గుంటూరులో వుండే నాలుగయిదు రోజుల్లో అమ్మ జగన్‌ను నెత్తిన పెట్టుకుండేది- అందుకే వాడికి ఆమె అంటే అంత ఇష్టం!

''మీ అమ్మకు ఏడు వారాల సొమ్ములుండేవట కదా... అవన్నీ మీ నాన్న ఆమెకే ధారాదత్తం చేసి వుంటాడు!''

రాణి కంఠంలో కసికి నేను కోపాన్ని నిగ్రహించుకోలేకపోయాను.

''రాణీ! ఒక్కటి గుర్తుంచుకో... ఇప్పుడు నాన్న పోయాడు... సరే! ఆయన చివరి చూపు ఎలాగూ దక్కలేదు... కనీసం కర్మయినా చేసి, అమ్మను ఓదార్చి వద్దామని వెళుతున్నాను... నీ దృష్టిలో ఆమె నాకు తల్లి కాకపోవచ్చు... కానీ, ఆమె నన్ను పెంచి స్వంత తల్లే అయింది. ఆమెను గురించి ఈసడింపుగా ఇంకొక్క మాట మాట్లాడినా నేను సహించను... నేను తిరిగి అమెరికా రాను!'' అన్నాను కఠినంగా. ఆ వాగ్ధోరణికి ఎక్కడో అక్కడ అడ్డుకట్ట వేయకపోతే అది నా బుర్రను తినేస్తుంది!

ఒక్కసారిగా ఏడ్వటం మొదలుపెట్టింది రాణి. ''అనండి... అనండి... నేను పరాయి యింటి నుంచి వచ్చాననే కదా మీ దాష్టీకం... సర్వం ఆమెకే సమర్పించి రండి... ఇక్కడ మన పిల్లలు ఏమైనా మీకు పట్టదు!''

నేను మాట్లాడలేదు.

ఎయిర్‌పోర్ట్‌కు వెళ్ళిందాకా ఆమె ఏడుపును ఆపనూ లేదు.

నేను కారు దిగి, ''బైబైరా... చిన్నార్లూ!'' రాణి వంక చూడకుండానే విమానాశ్రయపు అద్దాల తలుపుల గుండా లోపల కాలు పెట్టాను.

ఒట్టిడబ్బు మనిషి! ప్రేమలూ, బంధాలను కూడా వ్యాపారంలో భాగం గానే భావిస్తుంది!

నేను భరించలేను.

* * *

మూడో రోజు తెల్లవారు ఝామున గుంటూరులో వాల్వో ఏసీ దిగి బస్టాండు బయటకు వచ్చాను.

చల్లటి గాలి వీస్తోంది.

ఆటో డ్రైవర్లు చుట్టు ముట్టారు. ఓ పక్కగా పది మంది, చెత్తా చెదారం పోగు చేసి, చలిమంట వేసుకుంటూ దాని చుట్టూ ముడుచుకు కూర్చొని వున్నారు.

ఎక్కడికెళ్ళాలో చెప్పి ఆటోలో కూర్చున్నాను. అది పోతోంటే వేసుకున్న కోటు చలినేమాత్రం ఆపలేకపోతోంది.

గుంటూరు....

ఎన్ని సంవత్సరాలయింది వదిలిపెట్టి... ఇంటర్మీడియెట్ అయిన తర్వాత విశాఖ పట్టణంలో బి.టెక్... ఆ పైన అక్కడే ఎమ్. టెక్...

ప్రతి నెలా ఒకసారి వచ్చి వెళుతుండేవాడు అమ్మ పట్టుదలతో... ఏ నెలైనా రాకపోతే ఆమే వచ్చేది...

సంచీ నిండా కజ్జి కాయలు, లడ్లు, కారప్పూస...

'ఎందుకమ్మా ఇన్ని?'– అంటే నవ్వేది.

'నువ్వు తింటూ నీ గదిలో వున్న తోటి వాళ్ళకు పెట్టవా... అయినా ఎన్నని... మహా అయితే ఓ వారం రోజులు వస్తాయి!'

హిందూ కాలేజీ ముందుగా వెళ్ళి, ఏసీ కాలేజి, కాన్వెంటు దాటి ఓవర్ బ్రిడ్జి ఎక్కింది ఆటో.

తను పైపైకి వెళుతున్నాడు. అలా వెళుతున్నపడే, ఎంత డబ్బున్నా తన భర్త ఇంకా ఇంకా సంపాదించా లనే తపనతో వున్న రాణి నా భార్య అయింది.

ఆటో బ్రిడ్జి దిగుతోంది తనను లోయలోకి జారు స్తున్నట్లుగా.

కొద్ది నెలల్లోనే మామగారి ప్రమేయంతో బొంబా యిలో ఉద్యోగంలో చేరాడు. తరువాత రెండు సంవ త్సరాలు ఉన్నాడేమో ఇండియాలో....

ఆవిడగారు పట్టుబట్టడంతో అమెరికా విమానం ఎక్కక తప్పలేదు. తన తండ్రికి తను ఒక్కడే కొడుక యినా వాళ్ళను ఇక్కడే ఒంటరిగా వదిలి, అన్ని వేల మైళ్ళ దూరం వెళ్ళకా తప్పలేదు.

'చదివించి, పెద్దవాడిని చేసి, పెళ్ళి చేయటమే ఈనాటి తల్లిదండ్రుల బాధ్యత. తరువాత ఎవరి జీవి తాలు వారివే. మన దేశంలో కాబట్టి ఇంకా అమ్మా, నాన్నా అంటూ పట్టుకు వ్రేలాడుతున్నారు కొంత మంది నీలాంటి వాళ్ళు. అమెరికా అయితే అదీ లేదనే విన్నాను. పెళ్ళయిన మరునాడే వేరే ఇంట్లో కాపురం పెట్టేస్తారట!' నాన్న ఓదార్పు.

అమెరికా విమానం ఎక్కడానికి ఇంటినుండి బయల్దేరుతుంటే కళ్ళు తడిసినయ్.

ముందు రాత్రి చాలా సేపు నా పక్కనే నా మీద చేయి వేసుకు మౌనంగా కూర్చున్నది అమ్మ.

నాకు తెలుసు– ఆమె కళ్ళు నిగ్రహించు కుంటున్నా, గుండె చెరువే అవుతున్నదని....

బ్రాడీపేట చివరకు వెళ్ళింది ఆటో. నాలుగు మలుపులు తిప్పించి, ఓ ఇంటిముందు ఆపి దిగాను. ఆ ఇంట్లో దీపాలు వెలగటం లేదు. గేటు శబ్దమ య్యేలా తీశాను. ఆ శబ్దానికే అన్నట్లుగా తరువాత రెండు నిముషాలకు లోపల లైటు వెలిగింది. తలుపు తీస్తున్న చప్పుడు...

మా మామయ్య... ఎనభై ఏళ్ళ మామయ్య... కళ్ళ మీదగా చేయి పెట్టుకుని, గేటు వంక చూస్తూ, "ఎవరూ... శంకరుడేనా?" అన్నాడు బోసినోటితో.

చటుక్కున నాలుగు అడుగులు ముందుకు వేసి, వంగి ఆయన పాదాలకు నమస్కరిస్తూ, "అవును మామయ్యా!" అన్నాను.

"అంతా అయిపోయిందిరా నాన్నా!" అన్నాడు వంగి నా భుజాలు పట్టుకు ఎత్తుతూ.

జీరబోయిన కంఠంతో లోపల నుంచి రోదన స్వరం....

నాకు తెలుసు, ఆ కంఠం అమ్మదే... రాణి నోటి నుండి ఎప్పుడూ తేలిక భావంతో వెలువడే నా సవితి తల్లిదే...

తలుపు దగ్గరే బూట్లు విప్పి లోపలకు వెళ్ళాను.

ఆ హాల్లో చల్లటి కటిక నేల మీద పడుకుని, చీర చెంగును మొఖానికి అడ్డుపెట్టుకుని కుళ్ళి కుళ్ళి ఏడు స్తున్నది అమ్మ.

"అమ్మా!" ఆమె పక్కనే నేల మీద, ఆమెను ఆనుకు కూర్చొని, భుజం పట్టుకుని దగ్గరకు తీసుకు న్నాను. "అమ్మా!"

* * *

పన్నెండో రోజు సాయంత్రం నాలుగు గంటల ప్పుడు హాలులో చాపల మీద కూర్చున్నారు వచ్చిన బంధువులంతా. ఓ పక్కన పండితుల వేద పఠనం జరుగుతోంది. హైద్రాబాద్ నుంచి మా బావ మరిది వచ్చి కొత్త గుడ్డలిచ్చాడు. కట్టుకు కూర్చున్నాను నేను.

అందరూ నా వంకే చూస్తున్నారు...

మామయ్యా నోరు విప్పాడు. "శంకరా! ఈ జీవితం ప్రపంచం అనే రంగస్థలం మీద నడుస్తున్న ఓ నాటకం లాంటిది. ఏవేవో పాత్రలు ప్రవేశిస్తుంటాయి. వాళ్ళకు నిర్దేశించిన విధులను నిర్వర్తించి నిష్క్రమిస్తుంటాయి. ఈ వలయంలో మనమంతా పావులమే. మనిషి జన్మించిన ప్పుడు సంతోషిస్తాం. అనుబంధం పెంచుకోవటంతో మరణించినప్పుడు దుఃఖిస్తాం. ఆ చక్రం అలా తిరుగు తూనే వుంటుంది నిర్విరామంగా.... సరే! నాన్న పోయాడు... అదృష్టవంతుడు... ఆయన జీవితంలో ఎవ్వరికీ వీసమెత్తు హాని చేయకపోగా, చేతనయినంత వరకూ సాయమే చేశాడు. నలుగురూ చేయెత్తి నమస్క రించేలా బ్రతికాడు.

ఇక అమ్మ ఉంది. సాధ్వి. ఆమె ప్రేమతో నీ మీద అమృతాన్ని కురిపించింది. తోడూ నీడై, ఇంతవరకూ ఏ కష్టమూ తెలియకుండా బ్రతికిన ఆమెను నాన్న ఒంటరిగా వదిలి వెళ్ళిపోయాడు. ఇన్నాళ్ళూ ఆ మహా వృక్షం క్రింద ఓ చిన్న గువ్వలా ఈమె బ్రతికింది. ఆమెకు ఇక ఏ కష్టమూ కలగకుండా చూచుకోవాల్సిన బాధ్యత నీదే. మేమంతా ఉన్నాం. నాన్న ఆప్త మిత్రులు పూర్ణ చంద్రరావుగారు ఉన్నారు... నువ్వెక్క డున్నా ఆమె నీ మేలే కోరుతుంటుంది. అలాగే నువ్వూ ఆమె సంతోషాన్నే కాంక్షిస్తుంటావని నేను మనసా, వాచా నమ్ముతాను!"

నాకు దుఃఖం ఆగలేదు, అమ్మ గురించి మామయ్య అలా చెబుతుంటే....

ఆ మాటలు సర్వం మరిచి వింటున్న నన్ను రాణి క్రూరంగా చూస్తున్నట్లే కనబడుతున్నది.

నాకు యిరవై అయిదు సంవత్సరాలు వచ్చిన తరు వాత రాణి నా జీవితంలో కాలు పెట్టింది. కాని, అమ్మ నేను పుట్టిన నాలుగో సంవత్సరంలో కాలు పెట్టింది.

రాణి జలగలా నా రక్తాన్ని డబ్బు డబ్బు అంటూ పీలుస్తుంటే అమ్మ తన శక్తినంతా మేళవించి, కన్న తల్లి చనిపోయిన నాకు, తన ఊపిరినే నా ఊపిరిగా చేసి ఇంతవాడిని చేసింది.

చిన్న పిల్లవాడు జగన్‌కున్న జ్ఞానం రాణికి లేదు.

"నేను అమ్మను నాతో పాటు తీసుకు వెళతాను!" నా కళ్ళముందు రాణి రూపం మసకమసకగా కదులు తోంది. అయినా నాకు అలా చెప్పటంలోనే ఆనంద మున్నది.

హాల్లో అంతా నిశ్శబ్దం.

మామయ్య తృప్తిగా నా వంక చూస్తున్నాడు. నా పక్కనే కూర్చున్న పూర్ణచంద్రరావుగారు నా భుజం మీద ఆప్యాయంగా చేయివేశారు.

* * *

"నీ మనస్సు నాకు తెలుసు నాన్నా! కానీ నలభై అయిదు సంవత్సరాలు ఆయనతో మమేకమై, ఆయనే నా సర్వస్వం అనుకుంటూ ఈ ఊళ్ళో గడిపాను. ఇప్పుడు నా దేవుడు లేడు గదా అని, నన్ను ఇక్కడనుంచి తీసుకు వెళ్ళా లని నువ్వు ఎంత ఆప్యాయంగా అనుకుంటున్నా, ఈ పరిస రాలను వదిలి అంత దూరం రావటం నాకిష్టం లేదురా!" ఆమె చాప మీదే పడుకుని వున్నది.

అప్పుడు రాత్రి పదకొండు గంటలయింది.

ఆశీర్వచనాలు అయిన తరువాత అందరూ వెళ్ళి పోయారు. పదమూడో రోజుకు ఉండవల్సిన ముఖ్య బంధువులు నలుగురయిదుగురు హాల్లో చాపలు పరుచుకుని నిద్రలు పోతున్నారు.

పెద్ద మామయ్య కూడా 'పొద్దున్నే వస్తానురా' అంటూ, అత్తయ్యను అమ్మకు తోడుగా వుంచి వెళ్ళిపో యాడు. ఆమె పక్క గదిలో మంచం మీద పడుకుని నిద్రపోతున్నది.

మామయ్య వెళ్ళిపోతుంటే చెప్పాను. "పొద్దున్నే బావను బజారు పంపించి, కొండపల్లి బొమ్మలు ఎక్క డయినా దొరుకుతాయేమో ఓ పది రకాలు తెప్పించి పెట్టు మామయ్యా... జిక్కీ కావాలన్నది!" డబ్బు తీసి

## కన్నడం వైపు మళ్ళిన మంజుభార్గవి



కూచిపూడి నృత్యకారిణిగా రెండు వేలకు పైగా ప్రదర్శనలిచ్చి అంతర్జాతీయ ఖ్యాతి పొందిన మంజుభార్గవి నటిగా మాత్రం అంతగా పేరుపొందలేకపోయిందనే చెప్పాలి. 'యమగోల' సినిమాలో ఎన్.టి.ఆర్ సరసన మేనక పాత్ర ధరించడం ద్వారా మంజుభార్గవి చిత్ర రంగంలోకి ప్రవేశించింది. ఆ తరువాత చాలా సినిమాల్లో పెద్దగా గుర్తింపు లేని వ్యాంప్ తరహా వేషాలు పోషించింది. 'శంకరాభరణం'లో తులసి అనే వేశ్య పాత్ర ద్వారా చాలా పేరు లభించినా, తరువాత ఆ స్థాయి పాత్రలేవీ ఆమెకు లభించలేదు. తొంభైల్లో 'యమలీల', 'నిన్నే పెళ్ళాడుతా' లాంటి చిత్రాల్లో కేరెక్టర్ నటిగా మారిపోయింది. ఆమెకు అవకాశాలు తక్కువగా లభించడానికి ఆమె ఆరడుగుల ఎత్తు కూడా ఒక కారణం కావచ్చు. అయితే, అవకాశాలు తక్కువే లభించినా ఆమె ఎప్పుడూ తెలుగు చిత్ర రంగాన్ని వదిలి వెళ్ళలేదు. ఇప్పుడు తొలిసారి ఒక కన్నడ చిత్రంలో నటించబోతోంది. ప్రముఖ కన్నడ నటుడు శివరాజ్ కుమార్ నటిస్తోన్న 'హోడి మగా' అనే చిత్రంలో అతనికి తల్లి పాత్ర పోషించేందుకు అంగీకరించిందట.

ఇచ్చాను. అమ్మ దగ్గర చాప మీద కూర్చుంటూ, "చెప్పమ్మా! ఏం చేద్దాం అంటావు మరి.... నిన్ను ఒక్కదాన్నే ఇక్కడ వదిలి వెళ్ళటం నాకు మనస్కరించటం లేదు!" రాణి కళ్ళముందు మెదులుతూ నా గొంతు నొక్కుతున్నా, చెప్పకుండా వుండ లేకపోయాను ఆ మాటలు. రాణి గుణం అమ్మకు తెలిసినా, ఇంతవరకూ ఎప్పుడూ ఒక్క పొల్లు మాట మాట్లాడలేదు. నాకు తెలుసు, అలా మాట్లాడితే నేనెక్కడ బాధ పడతానోనన్నది ఆమె తపన. నా బ్రతుకు అడకత్తెరలో వక్క కాకూడదనేది ఆమె అంతరంగపు ఆలోచన.

"సరేనమ్మా! నీ ఇష్టం. నీ ఇష్టాన్ని కాదని నేను ఏమీ చేయలేను. ఎక్కడున్నా నువ్వు మనశ్శాంతితో గడపాలనేదే నా కోరిక!"

అమ్మ తన చేతిని నా గుండెల మీద వేసింది. 'నాకు తెలియదురా కన్నా, నీ సంగతి' అన్నట్లున్నది ఆ స్పర్శ.

ఆమె చూపులే నాకు తృప్తి... ఆమె మాటలే నాకు జీవం...

"ఇంతకు ముందు లాగానే డబ్బు పంపిస్తుంటాను. కాదని నన్ను బాధపెట్టవద్దు...."

"ఎందుకురా... మీ నాన్న నేను ఎక్కడ ఇబ్బంది పడతానో అన్నట్లుగా, ఆయన సంపాదన నంతా నెల వారీ వడ్డీ వచ్చేలా బ్యాంకులో వేశారు, ఆ పొలాల మీద వచ్చే ఆదాయం కోసం ఎక్కడ ఎదురు చూస్తూ కూర్చొని ఇబ్బంది పడతానోనని.. .. అయినా వాటిని చూసే ఓపిక నాకు లేదురా... అందుకే ఆ బరువు నా మీద పెట్టుకుండా అమ్మేసి డబ్బు తీసుకు వెళ్ళు. ఈ ఇల్లును చూస్తోంటే ఆయన్ని చూస్తున్నట్టే ఉందినాకు! నేను ఎక్కడున్న అప్పుడప్పుడైనా వచ్చి చూస్తుంటాను దీన్ని. ఈ ఆవరణలో తిరుగుతుంటే నాకు ఎంతో హాయిగా వుంటుందిరా!"

ఉలిక్కిపడుతూ ఆమె వంక చూశాను. రాణి అన్నట్లుగా ఆమె సోదరుల పంచన జేరబోతోందా?

"అదేంటమ్మా! ఇక్కడుండక ఎక్కడుంటావ్?"

"నాన్న నా భవిష్యత్తుకు ఎన్నో ఏర్పాట్లు చేశారురా. నువ్వు నా గురించి దిగులు పడాల్సిన అవసరమే లేదు. పూర్ణ చంద్రరావు అన్నయ్యగారు ఊరవతల నాలుగెకరాల పొలం తీసుకొని అందులో వృద్ధాశ్రమం తయారు చేశారు. అందులో నాన్న నా కోసం అన్ని హంగులతో చిన్న ఇల్లు కట్టించి ఉంచారు!"

"అమ్మా!" దుఃఖం ఆపుకోలేకపోయాను. పెంచిన కొడుకు బ్రతికి వుండీ, తల్లిని వృద్ధాశ్రమం లో ఉంచవలసిన స్థితి ఏర్పడు తున్నందుకు....

"అక్కడ నాలాంటి వయస్సు మళ్ళిన వాళ్ళు చాలా మంది వున్నారురా. నాన్న ఉండగానే వెళ్ళి చూసివచ్చాను. అదో ప్రపంచం... అన్నయ్యగారు దాన్ని ఎంత అందంగా తీర్చి దిద్దారో నువ్వు ఊహించలేవు కూడా!"

మాట్లాడలేకపోయాను, కంఠం బిగుసుకుపోయింది.

చటుక్కున ఓ ఆలోచన వచ్చింది. "నువ్వు వారికి నీ ఖర్చు నిమిత్తం ఒక్క పైసా కూడా కట్ట కుండా నేను శాశ్వత నిధిని ఏర్పరుస్తానమ్మా, నాన్న పేరున!"

ఆమె చిన్నగా నవ్వింది. "చెప్పాను కదరా... నేను వెనక్కు తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకుండా నాన్న అన్ని ఏర్పాట్లూ చేశాడని.... నీ ఇద్దరు పిల్లలూ వృద్ధిలోకి రావాలీ అంటే నీకెంత డబ్బు అవసరమో ఆలోచించుకో... జాగ్రత్త చేసుకో..."

రాణి మాటలు గుర్తుకు వచ్చినయి.

వెక్కి వెక్కి ఏడవసాగాను. ఆమె మాటలు వింటుంటే నా గుండె పగిలిపోతోంది. నా నరాలు పట్టుకొని ఏదో తెలియని భూతం నన్ను మెలితిప్పుతోంది.

"అంతే కాదురా నాన్నా! ఆయనకు ఎంత ముందచూపో చూడు. తరాలు మారుతున్నాయి... మనుష్యుల ఆలోచనలు మారుతున్నాయి... రేపు ఎవరు ఎలా ఉంటారో... పిల్లలు పెళ్ళిళ్ళయి, వాళ్ళ సంసారాలు వాళ్ళకు ఏర్పడిన తరువాత, తన కొడుకు, కోడలు ఎక్కడ ఇబ్బంది పడతారోనని, పూర్ణ చంద్రరావుగారి ఆశ్రమంలోనే మరో కాటేజీని కట్టించి అట్టిపెట్టారురా... నువ్వు ప్రతి నెలా పంపిన డబ్బును జాగ్రత్త చేసి!"

"అమ్మా!" నా నోరు పిడచకట్టుకుపోతోంది ఆమె మాటలు వింటుంటే.

గుడ్లప్పగించి ఆమెనీ, ఆ ఇంటినీ చూస్తున్నాను...

రాణి నా కళ్ళ ముందు నుంచి పూర్తిగా కనుమరుగయిపోయింది.

మరునాడు మధ్యాహ్నం భోజనాలకు కూర్చోబోతున్న సమయంలో, బావయితే ఎక్కడో వెతికి వెతికి జిక్కీ కోసం కొండపల్లి బొమ్మలు తెచ్చి ఇవ్వగలిగాడు గాని, ఎదురుగ్గా వున్న మా అమ్మను తీసుకు వెళ్ళి జగన్ కోరికను తీర్చే అవకాశం నాకు లేకుండా పోయింది.

ఎందుకో రాణి కోరిన, గుంటూరు నేత చీరలను కొనటానికి నా మనస్సు అంగీకరించటం లేదు!

*

